

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.36 గం.
సహర్ : ఆదివారం ఉ : 4:43 గం.

ముస్లింలకు జగ్గారెడ్డి రంజాన్ శుభాకాంక్షలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 5 : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి మెదక్ జిల్లాలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం సాయంత్రం సంగారెడ్డిలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. విందు సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింల భక్తి శ్రద్ధలకు ప్రతీక రంజాన్ పవిత్రమాసమని జగ్గారెడ్డి అన్నారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మైనారిటీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నిటినీ అమలు పరచి తీరతామన్నారు. ఈ విందులో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీకి ఖర్జూర పండు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, పక్కన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

రేపే మల్లన్న చివరివారం జాతర

- ఆదివారం రాత్రి అగ్నిగుండాలు
- ముగియనున్న బ్రహ్మోత్సవాలు

చేర్యాల, ఏప్రిల్ 5 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు రేపటితో ముగియనున్నాయి. ఆదివారం (12వవారం) చివరి వారం జాతర జరగనున్నది. మార్గశిరమాసం చివరి ఆదివారమైన జనవరి 7న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మూడునెలల పాటు కొనసాగి ఫాల్గుణమాసం చివరి ఆదివారం రాత్రి నిర్వహించనున్న అగ్నిగుండాలతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఆలయంలోని తోటబావి ప్రాంగణంలో వంటచెరుకుతో గుండాలను తయారు చేస్తారు. సోమవారం తెల్లవారు జామున ఆలయ అర్చకులు ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి అగ్నిగుండాలను దాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి ఆదివారం కావడంతో భక్తులు భారీగా తరలిరానున్నారు. వీరశైవ సాంప్రదాయం ప్రకారం నిర్వహిస్తున్న అగ్నిగుండాల కార్యక్రమానికి వీరశైవుల జగద్గురు వికారాబాద్ జిల్లా ఆలంపల్లి మండలం కెంపి నమఠాధీశ్వరుడు చెన్న బసవ ప్రభు మహాస్వామి నేడు కొమురవెల్లికి రానున్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

జాతర చివరి ఆదివారం కావడం, అగ్నిగుండాలు నిర్వహిస్తున్న క్రమంలో భక్తులు భారీగా తరలిరానున్నందున ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. భక్తుల మధ్య తోపులాటకు వీలులేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయించాం. దర్శనం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- బాలాజీశర్మ, ఈవో



అగ్నిగుండాలు నిర్వహించనున్న తోటబావి ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది



గాజులపల్లిలో ఎండిన వరి



నీళ్లు లేక బోసిపోతున్న నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్‌లోని ఎర్రచెరువు

జలం.. పాతాళం

11.24 మీటర్ల అడుగున భూగర్భజలాలు

- క్రమంగా పడిపోతున్న ఉపరితల నీటిమట్టం
- చెరువులు, కుంటలు, బావులకూ గడ్డుకాలం
- అడుగంటిన బోర్లతో అన్నదాతల ఆపసోపాలు
- ఎక్కడికక్కడ ఎండుతున్న పంటలు
- పశువుల మేతగా పొలాలు

సంవత్సరం	భూగర్భజలాలు (మీటర్లలో)
2024 మార్చి	11.24
2023 మార్చి	9.65
2022 మార్చి	10.04
2021 మార్చి	10.41
2020 మార్చి	13.95
2019 మార్చి	19.52



కుకునూరుపల్లి మండలం లకుడారంలో సాగునీటి కొరతతో గొర్రెలకు మేతగా మారిన వరి


ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 5: ఓ వైపు వర్షాభావం.. మరోవైపు ఎండల ప్రభావం వెరసి జిల్లాలో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా భూగర్భజలాలు పాతాళానికి పడిపోయాయి. చెరువులు, కుంటలు నీళ్లు లేక ఒట్టిపోయాయి. బావులు, బోర్లు అడుగంటిపోయాయి. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లలోనూ నీటిమట్టం తగ్గింది. ఆయకట్టు పొలాలు ఎండిపోయే స్థితికి చేరాయి. కోతకు వచ్చిన పంటలపొలాలు పశువుల మేతగా మారాయి.

అట్టడుగున భూగర్భజలాలు

జిల్లావ్యాప్తంగా భూగర్భజలాలు అట్టడుగుస్థాయికి చేరాయి. వేసవి మొదట్లోనే అంటే మార్చి నెలాఖరు వరకు నమోదైన రికార్డులు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో మరింత ఆందోళనను కలిగించే అవకాశాలు లేకపోలేదు. ఐదేళ్లలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చోటుచేసుకోలేదు. వానాకాలంలో వర్షాలు సక్రమంగా, రిజర్వాయర్లలో ఎత్తిపోతల మూలంగా గడిచిన ఐదారేళ్లు జిల్లా రైతాంగం కరువుఛాయలకు దూరమైంది. కానీ తాజా పరిణామాలు రైతులకు ఆశనిపాతంలా మారాయి. కళ్లముందే ఎండిపోతున్న పంటలను చూడలేక రైతులు తమ పశువులకు మేతగా వినియోగిస్తున్నారు. గత ఫిబ్రవరిలో 10.07 మీటర్ల లోతున ఉన్న భూగర్భజలాలు కేవలం ఒక్కనెల వ్యవధిలోనే ఒక మీటరు పైగా అడుగుకు చేరడం గమనార్హం. ఇక గత ఏడాది మార్చి నెలలో 9.65 మీటర్ల లోతున ఉండగా.. ప్రస్తుతం 11.24 మీటర్ల అడుగులో భూగర్భజలాలు ఉన్నాయి.

బావులు, బోర్లు వెలవెల

జిల్లాలో యాసంగి సాగు ప్రధానంగా బావులు, బోర్లపై ఆధారపడి చేస్తారు. అయితే ఈసారి చాలాచోట్ల వ్యవసాయ బావులు, బోర్లు వెలవెలబోయి కనిపిస్తున్నాయి. భూగర్భజలాల ప్రభావంతో బావుల్లో నీరు అడుగుకు చేరింది. చాలా ఏళ్ల తర్వాత రైతులు బావుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. ఇక బోర్ల మీద ఆధారపడిన రైతులు లా_ తో పూర్తిగా చేతులెత్తేశారు. పంటను పొలంలోనే వదిలేస్తున్నారు. ఐదారేళ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదని రైతులు వాపోతున్నారు. మున్ముందు ఇలాగే ఉంటే సాగు కష్టతరమవుతుందని పలువురు రైతులు చెబుతున్నారు.



ఎల్లాయిపల్లిలో నెర్రెలుబారిన పొలం



బెజ్జంకిలో అడుగంటిన బావి



బెజ్జంకి మండలం ముత్తన్నపేటలో బోరువేయగా నీరు పడకపోవడంతో ఎండిన పొలం

తాగునీటి సమస్య రావొద్దు

- ముందస్తు చర్యలు చేపట్టండి
- అందుబాటులో తాగునీటి వనరులు
- ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా

సిద్దిపేట అగ్రికల్చర్/కుకునూర్‌పల్లి/ కొండపాక ఏప్రిల్ 5: వేసవిలో నీటి వినియోగం పెరిగి తాగునీటి వనరులు తగ్గుతాయని, ఇలాంటి సమయాల్లో ప్రజా అవసరాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా సూచించారు. గజ్వేల్ మండలం అక్కారంలోని 40ఎంఎల్ సంప్‌హౌస్, కుకునూరుపల్లి మండలం తిప్పారంలోని రా వాటర్ పంప్‌హౌస్, మంగోల్‌లో 540 ఎంఎల్‌డీ డబ్ల్యూటీపీ, కొండపాక మండల కేంద్రంలోని ఇంటర్మీడియేటరీ హెచ్‌ఎం డబ్ల్యూఎస్‌ఎస్ సంప్‌హౌస్‌లను శుక్రవారం పరిశీలించారు. అనంతరం తాగునీటి సరఫరాపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో తాగునీటి వనరులు అందుబాటులో ఉన్నాయని, అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్య రాకుండా చూడాలన్నారు. గ్రామాల వారీగా యాక్షన్‌ప్లాన్ రూపొందించి కొత్త హాబిటేషన్లలో సమస్య తలెత్తకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో బోర్లు, చేతిపంపులను సిద్ధం చేయాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎక్కడైన సమస్య వచ్చినపుడు 24 గంటల్లోపు నీటిని పునరుద్ధరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈల ఫోన్ నంబర్లను పోస్టర్ల ద్వారా ప్రదర్శించాలని, ఏదైనా సమస్య వస్తే ఫోన్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు గ్రామాలను పరిశీలించాలని చెప్పారు. నీటి సమస్య రాకుండా ప్రతి మండలంలో 1, 3, 5 హెచ్‌పీ మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, ఇంజనీర్ విజయ్ ప్రకాష్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్‌చారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు.



కుకునూరుపల్లి మండలం తిప్పారం పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కలెక్టర్ మనుచౌదరి

సన్‌ఫ్లవర్ రైతుల నిరీక్షణ

- 15 రోజులుగా పొద్దుతిరుగుడు గింజల కొనుగోళ్లు బంద్
- తొగుట మార్కెట్‌యార్డు కేంద్రంలో పేరుకుపోయిన 7,500 క్వింటాళ్లు
- పడరానిపాట్లు పడుతున్న రైతులు
- త్వరగా కొనుగోలు చేసి న్యాయం చేయాలని ఆందోళన

7లో



పంట పండించడం ఒకెత్తయితే.. ఆ పంటను విక్రయించడం రైతులకు తలకు మించిన భారంగా మారుతుంది. దళారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోకుండా మద్దతు ధర దక్కేలా, రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నది. అయితే అధికారుల అలసత్వం వల్ల కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. తొగుట మార్కెట్ యార్డులో 15 రోజులుగా పొద్దుతిరుగుడు గింజలు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎండలకు తాళలేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- పదో తరగతి పరీక్షా కేంద్రంలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్
- విచారణ అనంతరం సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

7లో



గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో హరీశ్‌రావు

కాంగ్రెస్‌కు ఓట్లడిగే

నైతిక హక్కులేదు

- మోటార్లు కాలిపోతున్నాయి.. పొలాలు ఎండిపోతున్నాయి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

7లో

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ఫోరెన్సిక్ టీం విచారణ

- పేలుడు జరిగిన ప్రదేశంలో నమూనాల సేకరణ

హత్నూర, ఏప్రిల్ 5: సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని చందాపూర్‌లోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమను శుక్రవారం ఫోరెన్సిక్ టీం సందర్శించింది. రెండ్రోజుల క్రితం పేలుడు జరిగిన ప్రదేశాన్ని ఫోరెన్సిక్ టీం అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్‌రాజ్ నేతృత్వంలోని బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఘటనా స్థలంలో రసాయనాల నమూనాలు, రియాక్టర్ శకలాలను సేకరించింది. వాటన్నింటినీ విశ్లేషించిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని బృందంలోని సభ్యులు తెలిపారు. వారి వెంట జిన్నారం సీఐ అరుణ్‌కుమార్, ఎస్‌ఐ సుభాష్ ఉన్నారు.

వైద్యం అందక ఇబ్బందులు

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న కార్మికులు సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియాక్టర్ పేలిన ఘటనలో గాయపడిన బోయిని భిక్షపతి, అశోక్‌సింగ్, మహదేవ్, మదన్‌రావు ఎంఎన్‌ఆర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఇక్కడ తమకు సరైన వైద్య సేవలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా కార్మికులు సొంత ఖర్చులతో సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పరిశ్రమ యాజమాన్యం గాయపడినవారి గురించి పట్టించుకోవడం లేదని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.




పరిశ్రమ వద్ద రియాక్టర్, కెమికల్స్ నమూనాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ టీం



ఎంఎన్‌ఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మదన్‌రావు





'ఉపాధి' సరే.. కూలి ఎప్పుడిస్తరు!

● రెండు నెలలుగా అందని కూలి ● ఆందోళనలో ఉపాధి కూలీలు



అల్లాదుర్గం, ఏప్రిల్ 5 : మండుటెండను సైతం లెక్క చేయకుండా ఉపాధి పనికి వెళ్తున్న కూలీలకు రెండు నెలలుగా కూలి డబ్బు రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీ ఒక్కరికి పని కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామి పథకాన్ని ప్రవేశపెట్టింది. అల్లాదుర్గం మండలంలో సుమారు 7,390 రైతు కూలీలకు జాబ్‌కార్డులు అందించారు. కూలీలు ప్రతీ రోజు సుమారు 3,500 మంది వరకు ఈ పథకం కింద ఉపాధి పనులు చేస్తున్నారు. కూలీలకు మాత్రం ప్రభుత్వం గత ఫిబ్రవరి మాసం నుంచి కూలి డబ్బులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి రాకపోతే తమ జీవనం ఎలా గడుస్తుందంటూ వారు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కాయిదంపల్లి గ్రామంలో 250 పైబడి కూలీలు ఉపాధి పొందుతున్నారు. వీరికి పనులు ప్రారంభించినప్పటి నుంచి (12 వారాలుగా) కూలి డబ్బులు రాకపోవడంతో వారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారులకు ప్రతీ నెల వేతనాలు ఇస్తున్నా, తమ పట్ల ఎందుకు చిన్న చూపు అని మండిపడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు తక్షణమే కూలి డబ్బులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

ఏం తిని బతకాలి



పొట్టకూటి కోసం మండుటెండలో పనులు చేస్తున్న మాకు రెండు నెలలుగా కూలి డబ్బులు రాలేదు. మా కుటుంబం ఏం తిని బతకాలి. కూలి డబ్బులు ఇంకెప్పుడు వస్తాయని అధికారులను ప్రశ్నిస్తే నేడు, రేపు అంటు కాలం గడుపుతున్నారు. 11 వారాలుగా ఇవ్వడం లేదు.

- నాగారపు వీణ, కాయిదంపల్లి

కూలి డబ్బు రాకుంటే వలసలే గతి



మా గ్రామంలోనే ఉపాధి దొరుకుతుందని భావించి ఉపాధి పనులకు వెళ్తే సకాలంలో కూలి డబ్బులు రావడం లేదు. పొట్టకూటి కోసం అప్పు చేయాల్సి వస్తుంది. దీంతో జీవనోపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లక తప్పదు. రెండు నెలలు కూలి డబ్బును వెంటనే ఇప్పించాలి.

- తిమ్మపురం నరేష్, కాయిదంపల్లి


గంజాయి కింగ్‌పిన్ నీతూబాయి అరెస్టు

● విచారణ చేస్తున్న గౌరారం పోలీసులు



నీతూబాయిని విచారిస్తున్న సీఐ, ఎస్ఐ

వర్గల్, ఏప్రిల్ 5 : గంజాయి సరఫరా, విక్రయాల్లో ఆరితేరిన కింగ్‌పిన్ నీతూబాయిని శుక్రవారం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. సంఘటనకు సంబంధించి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో నివాసముంటున్న గంజాయి సరఫరా చేసే నిందితురాలు నీతూబాయిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఎక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చేది, ఎవరెవరికీ అమ్మేవారు, ఎవరెవరితో డిజిటల్ లావాదేవీలు జరిపారని ప్రశ్నించారు. పదేళ్ల నుంచి గంజాయిని విక్రయిస్తుండగా, ఇటీవల తనతో పాటు తన కుటుంబసభ్యులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు, గోల్కొండ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులపై 18 కేసులు నమోదు చేశారు. నీతూబాయిపై హైదరాబాద్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి సుమారు సంవత్సరం పాటు జైలులో ఉంచారు. తన ఆస్తులను అటాచ్ చేసినా, గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వర్గల్ మండలంలోని పలు గ్రామాల్లో గంజాయికి అలవాటు పడిన యువకులను విచారిస్తామని సీఐ తెలిపారు. గ్రామాల్లో గంజాయి విక్రయించిన, వారి వద్ద ఉన్న సిగరేట్‌లలో కలిపి తాగిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని సీఐ, ఎస్ఐ హెచ్చరించారు.



కాంగ్రెస్ అంటేనే మోసం

● రైతులకు ఇచ్చిన హామీ అమలుపై మాట తప్పిన సీఎం
● మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 5: కాంగ్రెస్ అంటేనే మోసమని, ప్రజలను మభ్యపెట్టడంలో ఆ పార్టీ ముందు ఉంటుందని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మండిపడ్డారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రైతు సత్యాగ్రహ దీక్షకు ఆయన హాజరై మాట్లాడారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టం జరిగిందని, ఎకరాలకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లిసామన్న కాంగ్రెస్ ఎందుకు మాట తప్పుతుందో ప్రజలకు చెప్పాలన్నారు. వరికి ఎకరానికి రూ.500 బోనస్ ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. ఆ పార్టీకి నోట్లు, ఓట్లు, సీట్లు, అధికార యావ తప్ప అన్నదాతలకు ఏం చేయాలనే విషయంపై స్పష్టత లేదన్నారు. రాహుల్‌గాంధీని తీసుకొచ్చి సభ పెడితే తుక్కు తుక్కుగా తొక్కి ఢిల్లీకి పంపుతామన్నారు. వెంకట్రామారెడ్డి కేసీఆర్ కాలు మొక్కి ఎమ్మెల్సీ అయ్యాడన్నారు. పైసలు ఉన్నాయని ఎంపీ సీట్ ఇచ్చారని ఆరోపించారు. అంతకు ముందు ఉదయం పట్టణంలోని స్టేడియం, జూనియర్ కళాశాల, వెస్లీ మైదానంలో వాకర్స్, క్రీడాకారులతో రఘుందన్‌రావు కలిసి వాకింగ్ చేశారు.





కాంగ్రెస్‌కు ఓట్లడిగే నైతిక హక్కులేదు

- మోటార్లు కాలిపోతున్నాయి.. పొలాలు ఎండిపోతున్నాయి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

పాపన్నపేట/చిన్నశంకరంపేట/మెదక్/గజ్వేల్, ఏప్రిల్ 5 : ఎన్నికల్లో 420 హామీలంటూ మాయమాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కులేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో, చిన్నశంకరంపేటలో, మెదక్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వరి ధాన్యానికి బోనస్ ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. డిసెంబర్ 9న రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని నమ్మబలికారని హరీశ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ రైతులను చిన్నచూపు చూస్తున్నదని అన్నారు. మోటార్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని, పొలాలు ఎండిపోతున్నాయని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి కరెంట్ పోతలేదు అంటున్నారని, కొత్తపల్లిలో ఇప్పుడే కరెంటు పోయిందంటూ ధ్వజమెత్తారు. మెదక్ జిల్లాకు మెడికల్ కళాశాల, రింగురోడ్డుకు నిధులు, రామయంపేటకు రెవెన్యూ డివిజన్ ఇచ్చామని గుర్తుచేశారు. వెంకట్రామారెడ్డి గుణంతో పాటు ధనం ఉన్న వ్యక్తి అని, రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి అందరికీ ఉపయోగకర పనులు చేస్తారని వెల్లడించారు. అనంతరం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, ఏకే గంగాధర్‌రావు, జడ్పీటీసీ మాధవీరాజు, నార్సింగి జడ్పీటీసీ కిష్టారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు





తొగుట మార్కెట్‌యార్డులోని కేంద్రంలో పేరుకుపోయిన పొద్దుతిరుగుడు గింజలు, రైతులతో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి


సన్‌ఫ్లవర్ రైతుల నిరీక్షణ

15 రోజులుగా పొద్దుతిరుగుడు గింజల కొనుగోళ్లు బంద్

- తొగుట మార్కెట్‌యార్డులో పేరుకుపోయిన 7,500 క్వింటాళ్లు
- పడరానిపాట్లు పడుతున్న రైతులు
- త్వరగా కొనుగోలు చేసి న్యాయం చేయాలని ఆందోళన

తొగుట, ఏప్రిల్ 5: రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం మార్కెట్‌యార్డుల్లో పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు సాగడంలేదు. పొద్దుతిరుగుడు గింజలు విక్రయానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఫిబ్రవరి 28న మార్క్‌ఫెడ్ అధికారులు తొగుట మార్కెట్ యార్డులో కాన్గల్ (పీఏసీఎస్) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటాల్‌కు రూ.6,760 మద్దతు ధర నిర్ణయించారు. పొద్దుతిరుగుడు గింజలను విక్రయించడానికి ఈ కొనుగోలు కేంద్రానికి దౌల్తాబాద్, రాయపోల్, మిరుదొడ్డి, తొగుట మండలాల నుంచి రైతులు తరలివచ్చారు. కాగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన 20 రోజుల్లోనే 222 మంది రైతుల నుంచి 2,764 క్వింటాళ్ల గింజలను కొనుగోలు చేసి ఇక్కడి నుంచి తరలించారు. కానీ, 15 రోజులుగా మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రానికి గన్నీ బ్యాగులు సరఫరా చేయకపోవడంతో సుమారు 250 మంది రైతులకు చెందిన 7,500 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు గింజలు మార్కెట్‌లో పేరుకుపోయాయి. అసలే ఎండాకాలం కావడంతో మార్కెట్‌కు వచ్చిన రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. పొద్దుతిరుగుడు గింజలు తొందరగా కొనుగోలు చేసి న్యాయం చేయాలని రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి అక్కడికి చేరుకుని రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్ కార్యాలయం ముట్టడిద్దామని వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు



ఇంతకు ముందు కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు గింజలను రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వం సేకరించి నిలిపివేసింది. మిగతా పొద్దుతిరుగుడు గింజలను యథావిధిగా రాష్ట్రప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు కొనుగోళ్ల విషయమై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. - కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి, కాన్గల్ పీఏసీఎస్ చైర్మన్

అరిగోస పడుతున్న పట్టించుకుంటలేరు



తొగుట మార్కెట్‌యార్డుకు 15 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు గింజలు తీసుకుని వచ్చి 13 రోజులైతుంది. ఇప్పటివరకు గన్నీబ్యాగ్‌లు ఇస్తలేరు. అడిగితే ఒక్కరూ పట్టించుకుంట లేరు. ఎండలో తెకాలు పడి.... అరిగోస పడుతున్నం. తొందరగా కొనుగోలు చేసి న్యాయం చేయాలి.
- బోదాసు నర్సవ్వ, అల్వాల, మిరుదొడ్డి మండలం

కొంటరా... కొనరా?



గన్నీ బ్యాగ్‌లిస్తలేరు. అడిగితే సప్పుడు చేస్తలేరు. 15 రోజులుగా కుప్పల వద్ద ఎండలో చస్తున్నం. అసలు పొద్దుతిరుగుడు గింజలు కొంటరా... కొనరా? ఏదన్న ఒకటి చెబితే మాదారి మేము చూసుకుంటం. రోజు పొద్దున ఇక్కడికి రావడం రాత్రి ఇంటికి పోవడం ఇబ్బందైతుంది.
- బైకరి నర్సింహులు, వీరారెడ్డిపల్లి, అక్బర్‌పేట- భూంపల్లి మండలం

పొట్లపల్లి ఆలయంలో బలగం డైరెక్టర్ పూజలు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 : బలగం సినిమా డైరెక్టర్ ఎల్దండి వేణు శుక్రవారం హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలను అందజేసి సన్మానించారు.



వేణుకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ

మెతుకుసీమలో కాంగ్రెస్‌లోకి వలసలు

- తుక్కుగూడ సభలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేరికకు ముహూర్తం
- ఉగాది తర్వాత పెద్దఎత్తున చేరికలంటూ ప్రచారం

మెదక్, ఏప్రిల్ 5 : బీఆర్ఎస్ కంచుకోటగా పేరున్న మెతుకుసీమలో ఆ పార్టీకి బీటలు బారుతున్నాయి. నేతలు అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం కావడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. తన ప్రధాన అనుచరుల్లో ఒకరైన ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డితో పాటు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమయ్యారు. నేడు తుక్కుగూడలో తలపెట్టిన కాంగ్రెస్ సభలో వారంతా పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సభకు కాంగ్రెస్ ఆలిండియా ప్రెసిడెంట్ మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక హాజరై పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించనున్నారు. ఇదే సభలో పెద్దల సమక్షంలో పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే మాజీ సీఎం ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ చేజిక్కించుకుంది. బొంది రాఘవేందర్‌గౌడ్‌పై అవిశ్వాసం నెగ్గి, కాంగ్రెస్‌కు చెందిన మామిండ్ల జ్యోతికృష్ణ చైర్మన్ పదవిని అధిష్ఠించారు. ఈ మధ్యనే రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు దేమె యాదగిరి, దేవుని జయ, సుందర్ సింగ్, చిలుక గంగాధర్ హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ నివాసంలో సీనియర్ నాయకులు హన్మంత్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు.



అదే దోవలో మెదక్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు

నెల రోజులుగా మెదక్ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి పరాజయం పాలయ్యారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన పద్మారెడ్డి ఓటమి పాలు కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం తదితర పరిణామాలతో బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం పార్టీ నుంచి వైదొలిగి కాంగ్రెస్‌లో చేరుతున్నది. బుధవారం మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు వసంత్‌రాజ్, కళ్యాణి, జయశ్రీ, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మందుగుల గంగాధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్, దుర్గాప్రసాద్ మైనంపల్లి హన్మంత్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఉగాది పండుగ తర్వాత మరికొందరు పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, గతంలో కాంగ్రెస్ నుంచి జంప్ అయిన నాయకులు ఇప్పుడు మళ్లీ సొంత గూటికి చేరేందుకు తహతహలాడుతున్నారని ప్రచారం జరుగుతుంది. ఉగాది తరువాత బీఆర్ఎస్ నుంచి పెద్దఎత్తున చేరికలు ఉండబోతున్నాయని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

వాహనాల తనిఖీలో రూ.6 లక్షలు సీజ్

మనూరు, ఏప్రిల్ 5: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా కారులో తరలిస్తున్న రూ.6 లక్షలను మనూరు ఎస్‌ఐ ఆమానాయక్ శుక్రవారం సీజ్ చేశారు. మండల పరిధిలోని బాదల్‌గాం చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, జహీరాబాద్ నుంచి నాగల్‌గిద్ద మండలం మావినెల్లి గ్రామానికి వెళ్తున్న కారులో ఎలాంటి అనుమతి లేకుండా తీసుకెళ్తున్న రూ.6 లక్షలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కారులో తన్వీర్ మైనోద్దిన్ ఉన్నారని తెలిపారు.



కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద రూ.95 వేల నగదు

మనోహరాబాద్, ఏప్రిల్ 5: మండలంలోని కాళ్లకల్ ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.95 వేలు పట్టుబడ్డాయి. కొంపల్లి నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న బూర్గుల జయరామ్‌రెడ్డి ఎలాంటి పత్రాలు చూపించకుండా రూ.95 వేల నగదును తీసుకెళ్తుండడంతో సీజ్ చేశారు. ఈ డబ్బును సిద్దిపేట డీటీవో ఆఫీస్‌కు తరలించినట్లు ఎస్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.



రామంతాపూర్ ఊరచెరువు తూము

ఊరచెరువు నీటి చౌర్యంపై పోలీసులకు ఫిర్యాదు

మాసాయిపేట, ఏప్రిల్ 5 : మాసాయిపేట మండలం రామంతాపూర్‌లోని ఊరచెరువు తూము గేట్లను తెరిచి అక్రమంగా నీటిని తరలిస్తున్నారని గ్రామానికి చెందిన కొందరు గురువారం రాత్రి చేగుంట పోలీసులకు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 15 రోజుల క్రితం ఇలాంటి సంఘటనతోనే అధికారులు తూములను మూసివేయగా తిరిగి మళ్లీ తెరవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొన్నది. చేగుంట ఎస్‌ఐ బాలరాజు నేతృత్వంలో పోలీసులు గురువారం అర్ధరాత్రి రామంతాపూర్ గ్రామానికి చేరుకుని రైతులను సముదాయించారు. పంటలు ఎండిపోతున్న ప్రస్తుత తరుణంలో గ్రామస్థులు కలిసి మెలిసి ఉండాలని, శాంతియుతంగా ఉండాలని పోలీసులు రైతులకు సూచించారు. చెరువులో ఉన్న చేపలు మృతిచెందేలా నీటిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- పదో తరగతి పరీక్షా కేంద్రంలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్
- విచారణ అనంతరం సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

కొండపాక, ఏప్రిల్ 5 : సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ పదో తరగతి కేంద్రంలో ఓ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల పదో తరగతి పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రంలో మార్చి 26న ఫిజిక్స్ పరీక్ష రాస్తున్న సమయంలో ఇన్విజిలేటర్‌గా వ్యవహరించిన చంద్రభాను అనే ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. అదే రోజు చీఫ్ సూపరింటెండెంట్‌కు విద్యార్థిని ఫిర్యాదు చేసింది. ఆయన విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదించగా విచారణకు ఆదేశించారు. నాలుగు రోజులు విచారించిన అనంతరం ఉపాధ్యాయుడు చంద్రభానును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చాడు. ఈ విషయంపై ఎంఈవో ను వివరణ కోరగా సస్పెన్షన్ ఉత్తర్వులు వాస్తవమేనని తెలిపారు.

నృసింహుడి దర్శనం పుణ్యఫలం

- రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి
- నాచగిరి క్షేత్రంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



వర్గల్, ఏప్రిల్ 5 : నాచగిరి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనృసింహుడిని దర్శించుకుంటే జన్మజన్మల పుణ్యఫలం దక్కుతుందని రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీస్వామి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కొనసాగుతున్న నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే క్షేత్రంలో ఏర్పాటు చేసిన ధార్మిక, సంగీత, సాహిత్య హరికథా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవానంద సరస్వతీ భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ప్రతీ ఒక్కరూ దైవభక్తిని అలవరుచుకోవాలన్నారు. దైవమార్గంలో నడిచినట్లయితే అన్ని శుభాలే కలుగుతాయన్నారు. లక్ష్మీ నృసింహుడిని నమ్ముకున్నవారికి అంత విజయమేనన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి హనుమంతోత్సవ సేవ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి.







సమసమాజ స్థాపనకు
పోరాడిన మహనీయుడు

జిల్లావ్యాప్తంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి


సిద్ది పేట అర్బన్: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సామాజిక సంస్కర్త, మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం పోరాడిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 5: సామాజిక విప్లవయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రావు జయంతి కార్యక్రమాలను శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఆయా సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల, ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, బొగ్గులోనిబండ గ్రామాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు.

● **గజ్వేల్:** బాబు జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు కృషిచేస్తామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు.పట్టణంలోని తూప్రాన్ సర్కిల్‌లో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు నాయిని యాదగిరి, మండలాధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, సందీప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్ బొగ్గుల చందు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కళ్యాణ్‌కర్ నర్సింగరావు తదితరులతో కలసి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, కౌన్సిలర్ బబ్బూరి రజిత, అంబేడ్కర్ సంఘం నాయకులు అటకూరి రాములు, బొల్లారం ఎల్లయ్య, కృష్ణయ్యల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధఃగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో రామ్మూర్తి


వర్గల్ తహసీల్ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

● **హుస్నాబాద్‌రూరల్:** మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామ్మూర్తి, అంబేడ్కర్ చౌరస్తాలో దళిత,బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు, ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, డీటీ, అంబేడ్కర్ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోహెడ మండలం చెంచల్‌చెర్వుపల్లిలో గ్రామస్థులు బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, భీంరెడ్డి తిరుపతిరెడ్డి, రమేష్, సంపత్, రాజయ్య, తదితరులు ఉన్నారు.

● చేర్యాల: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం చేర్యాల, కొమురవెల్లి మండలాలలో ఘనంగా నిర్వహించారు. చేర్యాల అంగడిబజారు చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు మంచాల చిరంజీవులు, ఆడెపు నరేందర్ తదితరులు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొమురవెల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేర్యాల ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, కొమురవెల్లి ఎంపీపీ తలారి కీర్తన, జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, నాయకులు, రాంసాగర్ గ్రామంలో మాజీ సర్పంచు తాడూరి రవీందర్, తాడూరి దుర్గయ్య జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాకలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆ సంఘం అధ్యక్షుడు రాజమల్లు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కాల్వలింగం, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ గంగరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లు కల్పనా, యాదగిరి, స్వామి, ఇల్లెందుల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేష్‌గౌడ్, ప్రవీణ్, వెంకట్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు రాజమల్లు, భూపాల్‌లు, మిరుదొడ్డిలో చార్వ కుమార్, మల్లయ్య, ధర్మారం బాబు, అక్బర్‌పేటలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేర్వేరుగా పూలమాలను వేసి నివాళులను అర్పించారు.

●**నంగునూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో దళిత సంఘాల నాయకులు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలంలోని పాలమాకుల నంగునూరు నర్మెట్ట లో జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలవేసి ఆయన సేవలు కొనియాడారు. నంగునూరులో జరిగిన కార్యక్రమంలో దేవులపల్లి రాజమౌళి, దేవులపల్లి యాదగిరి పాల్గొన్నారు.

● **అక్కన్నపేట:** మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తోందూరి ఎల్లయ్య బహుజన్. మాజీ ఉపసర్పంచ్ గుండేటి సారయ్య, బాకే సంజీవ్, బాకే రాజు, పొడిశెట్టి వెంకటయ్య, తదితరులున్నారు.

● **నారాయణరావుపేట:** మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్, గోపులాపూర్, కోదండరావుపల్లితో పాటు పలు గ్రామాల్లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీవో శ్రీనివాస్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని ఆయా గ్రామాల్లో పలు సంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులార్పించారు.

● **వర్గల్:** వర్గల్ తహసీల్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

● **కొండపాక:** మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండపాక మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము మల్లికార్జున్,కోఆర్డినేటర్ చిరంజీవి, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కొండపాకలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుద్దెడలో అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాకీ రాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.


గజ్వేల్ పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

● **దూళిమిట్ట:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో, మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● **ములుగు:** బాబు జగ్జీవన్‌రావ్ కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉండి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడని హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ నీరజ ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ములుగు మండలం హార్టికల్చర్ యూనివర్సిటీలో బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌బాబు, జగ్జీవన్‌రావ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

● **రాయపోల్:** మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింహులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్‌అధ్యక్షుడు రవి తదితరులు ఉన్నారు.

●**మర్కుక్:** మండలంలోని చేబర్తిలో మహనీయుల ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు జాలని యాదగిరి ప్రధాన కార్యదర్శి శమ్మని కనకరాజు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాందాస్‌గౌడ్, సిద్దిపేట జిల్లా స్వేరో ప్రధాన కార్యదర్శి చిన్ని, మర్కుక్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి, సారధి ఫౌండేషన్ చైర్మెన్ గుడాల శేఖర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

● **మద్దూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ అనంతరెడ్డి బాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హత్యాయత్నానికి పాల్పడిన నిందితులు అరెస్ట్

కొండపాక, ఏప్రిల్ 5: కొండపాక గ్రామానికి చెందిన రేపాక చందు అనే యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులను కుకునూరుపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొండపాక గ్రామానికి చెందిన రేపాక చందు అనే వ్యక్తిపై పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన రేపాక అశోక్(32) అతని తమ్ముళ్లు రేపాక నవీన్(22), రేపాక సంతోష్ కుమార్(28) ముగ్గురు కలిసి గురువారం దాడి చేసి హత్యాయత్నం చేసి పరారీలో ఉన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ శుక్రవారం వారిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


పోలీసుల విధులకు ఆటంకం కలిగించినవారికి రిమాండ్

రాయపోల్, ఏప్రిల్ 5: పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి తెలిపారు. మూడు రోజుల క్రితం రాత్రి ఉదయపూర్ గ్రామానికి చెందిన టెంకంపేట రాంచంద్రం, టెంకంపేట నాగరాజు తాగిన మైకంలో రాయపోల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విధుల్లో ఉన్న పోలీసులతో గొడవపడి దుర్భాషలాడారు. విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్స్ సిబ్బంది వారికి నర్ది చెప్పినా వినకపోగా మీరేం చేయలేరని బెదిరిస్తూ, మెయిన్ రోడ్డుపైకి వెళ్లి వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన..
మరో న్యాయవాదిపై కేసు నమోదు చేయాలి

గజ్వేల్/గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 5: గజ్వేల్‌కు చెందిన న్యాయవాది బత్తుల రాజుపై దాడికి పాల్పడిన మరో న్యాయవాదిపై కేసు నమోదు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దళిత ఉద్యోగుల జేఏసీ నాయకులు పంబాల ఎల్లయ్య, పి.సత్యనారాయణ, ఎర్ర మల్లేశంతో కలసి మాట్లాడుతూ దళిత న్యాయవాది రాజు ప్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా అతడిపై తన అనుచరులతో కలసి దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన న్యాయవాదిపై, ఆయన అనుచరులపై తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాతీయ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

మర్కుక్ మండలంలో కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు


వివిధ పార్టీల నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సారెడ్డి

మర్కుక్, ఏప్రిల్ 5: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారని కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కనకయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశంగౌడ్, గ్రామశాఖల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పత్తి నర్సింహులు యాదవ్, సింగం వెంకటేశ్ ఆధ్వర్యంలో దామరకుంట, కాశిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు గజ్వేల్‌లో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో దామరకుంట వార్డు సభ్యులు సంగం నర్సింలు, బొల్లబోయిన కుమార్, న్యాలపల్లి పరమేశ్వర్, దే వి, రమేశ్, బక్కుల యాదగిరి, బాల్చందర్, పన్యాల మహేందర్‌రెడ్డి, రవిగౌడ్, బక్కుల రాజు, రాజబోయిన కుమార్, బక్కుల కృష్ణ, వర్గంటి రవి, బక్కుల సంజీవ, బక్కుల బాలయ్య, బక్కుల అంజనేయులు, బక్కుల పర్శరాములు, న్యాళ్ళపల్లి ఎల్లం, కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుబ్బాక యాదగిరి, బాబురావు, మహేందర్, గణేష్, చంద్రయ్య, సింగం సాయి తదితరులున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనం అంజనేయులు, నర్సింలు, అప్పాల రమేశ్ ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దుబ్బాక/మిరుదొడ్డి, ఏప్రిల్ 5: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం అక్బర్‌పేటలోని కూడవెళ్లి వాగులోకి ప్రభుత్వం నీటిని విడుదల చేయడంతో కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలో శ్రీరామాలయం వద్ద, అక్బర్‌పేట, మిరుదొడ్డి గ్రామాల్లో కూడవెళ్లి వాగులోకి నీటిని విడుదల చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్, సురేఖ, దుబ్బాక కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దుబ్బాక మున్సిపాలిటీలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీకి చెందిన 20మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుల నియామకం


కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నూతన మండలాధ్యక్షులు

చేర్యాల, ఏప్రిల్ 5: కాంగ్రెస్ పార్టీ చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చేర్యాల మండల అధ్యక్షుడిగా ఆకునూరు గ్రామానికి చెందిన కొమ్ము రవి, కొమురవెల్లి మండలాధ్యక్షుడిగా కొమురవెల్లికి చెందిన మహదేవుని శ్రీనివాస్, మద్దూరు మండలాధ్యక్షుడిగా గౌరాయపల్లి గ్రామానికి చెందిన మ్యాక మల్లేశం, ధూళిమిట్ట మండలాధ్యక్షుడిగా కోల సాయిలు, చేర్యాల పట్టణ అధ్యక్షుడిగా మంచాల చిరంజీవులు నియామకమయ్యారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచనానుసారం కొద్దిరోజులక్రితం గ్రామకమిటీలు పూర్తిచేయగా, మండలాధ్యక్షుల ఎంపికపై తీవ్రపోటీ నెలకొన్నప్పటికీ, గత ఎన్నికలలో పనితీరుతో పాటు సామాజిక కోణంలో పరిశీలించి వారిని నియామకం చేసి కొమ్మూరి తనదైన మార్క్ చాటుకున్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

మద్దూరు, ఏప్రిల్ 5: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభాకర్ హెచ్చరించారు. శుక్రవారం మద్దూరు పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. వైద్యాధికారితో పాటు సిబ్బంది ఎవరూ విధులకు హాజరు కాలేదు. హెచ్ఏ రఘు ఓపీ విధులు నిర్వహించారు. ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడారు. బాబు జగ్జీవన్‌రాం జయంతి కార్యక్రమం సందర్భంగా సెలవు ఉందని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.


పంచతంత్రలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

చేర్యాల, ఏప్రిల్ 5: చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలకిషన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కింగ్‌స్టన్ బీఈడ్‌కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ అనంతరెడ్డి, లైఫ్ కోచ్ బొడ్డు వినోద్‌కుమార్ చేతులమీదుగా పాఠశాల విద్యార్థులందరికీ పట్టా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెదలు తూ ప్రణాళికాపరంగా చదువుకోవాలని సూచించారు.

'హక్కుల పరిరక్షణకు బహుజనులు ఏకం కావాలి'

హుస్నాబాద్‌రూరల్, మార్చి 5: రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం బహుజనులందరూ ఏకం కావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రాజ్యాంగ రక్షణ యాత్ర శుక్రవారం హుస్నాబాద్‌కు చేరుకున్నది. యాత్రకు అంబేడ్కర్ చౌరస్తాలో మాల మహానాడు నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా దళిత, బహుజనులకు సంక్రమించిన హక్కులను కాలరాయడానికి రాజ్యాంగ సవరణ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపటిటన యాత్ర ఈనెల 8న ముగియనుందన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 8న జరిగే భారీ బహిరంగ సభకు బహుజనులందరు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

నంగునూరు, ఏప్రిల్ 5: మండలంలోని ఖానాపూర్‌లో హనుమాన్ ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని శివపార్వతులకు ఒడిబియ్యం పోశారు. పల్లకిలో శివపార్వతుల శోభాయాత్రలో గ్రామ మహిళలు మంగళహారతులు, కొబ్బరికాయలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సారబుడ్ల జనార్దన్ రెడ్డి,వంటేరు రాజశేఖర్ రెడ్డి, సతీశ్, మొగుళ్ల నర్సింహారెడ్డి, అనుముల హన్మంత రెడ్డి, మొగుళ్ల మాణిక్యరెడ్డి, కాసాని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి

హుస్నాబాద్‌రూరల్/దౌల్తాబాద్, మార్చి 5: ఈనెల 6న తక్కుగూడలో శనివారం జరిగే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు భారీగా తరలిరావాలని చేయాలని హుస్నాబాద్ నియోజక వర్గ ఎన్నికల కోఆర్డినేటర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదేవిధంగా సభకు దౌల్తాబాద్ మండలంలోని ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కాంగ్రెస్ దౌల్తాబాద్ మండలాధ్యక్షుడు పడాల రాములు పిలుపునిచ్చారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● సిద్దిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష


మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 5 : వడగళ్ల వానతో అన్ని రకాల పంటలు నష్టపోయాయని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆకాల వర్షంతో రైతులకు పంట నష్టం జరిగిందని, అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దీక్ష చేస్తున్నామని తెలిపారు. సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద బీజేపీ చేపట్టిన రైతు సత్యాగ్రహ దీక్షలో కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పంట నష్టపోయిన రైతులను పరామర్శించలేదని కామారెడ్డి ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దీక్ష చేస్తున్నమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పంట నష్టపోయిన రైతులను పరామర్శించలేదని విమర్శించారు. అధికారులు తప్పుడు లెక్కలు చెబుతూ చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు.

భారత్ స్వామి ట్రస్ట్, పతంజలి యోగ సమితి కమిటీ ఎన్నిక

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 5: ఆరోగ్య ప్రపంచాన్ని నిర్మించడమే లక్ష్యంగా చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలని యోగాసనా భారత్ జాతీయ సహాయ కార్యదర్శి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు, తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో విశిష్టతను సంతరించుకున్న యోగ విద్యను అందరికీ అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. భారతీయ సంస్కృతి, యోగ విద్య అందరికీ మరింత విస్తరించే నేపథ్యంలో సిద్దిపేట భారత స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగ సమితి, యువభారత్ సిద్దిపేట జిల్లా కమిటీని ఆయన ప్రకటించారు. కమిటీ కన్వీనర్‌గా తోట అశోక్, సభ్యులుగా రంగాచారి, చిప్ప ప్రభాకర్, నర్సింహులు, రాములును ప్రకటించారు. సమావేశంలో బీర్కూర్ మనోహర్, కామారెడ్డి జిల్లా భారత స్వాభిమాన్ ట్రస్టు అధ్యక్షుడు రాం రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.



సిద్ది పేటలో మాట్లాడుతున్న కృపాకర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


చిన్నకోడూరు: అల్లీపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం


చిన్నకోడూరు, ఏప్రిల్ 5: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం మహిపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని అల్లీపూర్, ఎల్లాయిపల్లి, కిష్టాపూర్, మాచాపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీసీ బాల్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తుందని ఎంపీడీవో శ్రీరాములు తెలిపారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్, గుర్రాలగొంది, గోపులాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం ధర్మసాగర్, సీసీ భాగ్యలక్ష్మి, పంచాయితీ కార్యదర్శులు చారీ, అరుణ, గౌస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** చేర్యాల మండలం ముస్త్యాల, వేచరేణి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఏపీఎం ప్రకాశం, మహిళా సంఘాల ప్రతినిధులు ప్రారంభించారు.

సిద్దిపేట మున్సిపల్‌పై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెడతాం

● విలేకరుల సమావేశంలో 37వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్


మాట్లాడుతున్న 37వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 5: త్వరలోనే సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని 37వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్ స్పష్టం చేశారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ పోచమ్మ ఆలయం కమిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మి మాట్లాడారు. స్థానికేతరుడైన బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి తమపై జులుం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలోని సర్వేనెంబర్ 1340లో కొండం సంపత్‌రెడ్డి ప్రభుత్వానికి సంబంధించిన భూములను చాలా వరకు కబ్జాలు చేశాడని, అతడి అక్రమాల చిట్టాను త్వరలో కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఇదే సర్వే నెంబర్‌లో ఉన్న నా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుందామనుకుంటే అందుకు సంపత్‌రెడ్డి రూ.2 లక్షలు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఆయన వార్డులో ఎవరైనా ఇల్లు నిర్మించుకుందామనుకున్నా, చివరకు విద్యుత్ మీటర్ కావాలన్నా కొండం సంపత్‌రెడ్డి భార్య కౌన్సిలర్ కవిత సంతకం తప్పనిసరిగా ఉండేలా సంబంధిత అధికారులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటూనే దళితులమైన తమపై కొండం సంపత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు వివక్ష చూయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. 37వ వార్డులో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తే ఇంతవరకు వేయలేదని, ఇంతగా వివక్ష చూపిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సుపై తప్పకుండా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని, అందుకు ఇతర సభ్యుల మద్దతు కూడా తమకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. నా స్వలాభం కోసం పార్టీ మారదు.. అప్పుడైనా, ఇప్పుడైనా నేను నా వార్డు ప్రజల కోసమే పని చేస్తానని స్పష్టం చేశారు. తమ వార్డులో కుల సంఘాల్లో కొండం సంపత్‌రెడ్డి, రాజనర్సు చిచ్చు రేపుతున్నారని, అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. వీటన్నిటిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని, ఆధారాలు చూపించకపోతే నా కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. 20 ఏళ్ల నుంచి చైర్మన్ పదవిలో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సును గద్ద దింపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొలను నరేష్, ప్రసాద్, మల్లేశం, సాకి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం, ధర్మం కోసం..
పార్లమెంట్ ఎన్నికలు

● బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు


ప్రచారంలో మాట్లాడుతున్న రఘునందన్ రావు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 5: దేశం కోసం, ధర్మం కోసం పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శరబేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేసిన మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడారు. 17వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రసంగిస్తూ బీజేపీకి ఓటేయాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి సిద్దిపేట జిల్లాకు ప్రత్యేకమైన అనుబంధం ఏమీ లేదన్నారు. మెదక్ జిల్లా నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లిన వారు ఎవరూ లేరా అని ప్రశ్నించారు. వెంకట్రామారెడ్డి పదేళ్లు కలెక్టర్‌గా ఉండి పది పైసలు సిద్దిపేటకు ఖర్చు చేసిండా అని ప్రశ్నించారు. కలెక్టర్ జీతం రూ. లక్ష అయితే వెయ్యి కోట్లు పెట్టి వంద ఎకరాల స్థలాన్ని ఎలా కొన్నావన్నారు. మండిపడ్డారు. మీ గర్వం వల్లే నేడు సారుకి దండం పెట్టి కారును వదిలి వెళుతున్నారని తెలిపారు. తెలంగాణలో గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్‌లో భార్య భర్తల ఫోన్‌లు విన్నారన్నారు. 2018లో కేసీఆర్ ఏం మాట్లాడో నేడు రేవంత్ రెడ్డి అదే మాట్లాడుతున్నాడన్నారు. రాహల్ గాంధీ ప్రధానిగా ఈ జన్మలో కలలో కూడా కాదన్నారు. 500 ఏళ్లుగా ఎవరికీ సాధ్యం కాని రామ మందిర నిర్మాణాన్ని ప్రధాని మోదీ సుసాధ్యం చేశాడన్నారు. అనంతరం కాటేపల్లి వెంకట్ రమణారెడ్డి మాట్లాడుతూ అపజయమెరుగని కేసీఆర్‌ను, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీ కార్యకర్త ఓడించాడని గుర్తు చేశారు. తెలంగాణ లో 17 ఎంపీ స్థానాలు బీజేపీ గెలిచే విధంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు.

అష్టావధాని గౌరీభట్ల శ్రీనాథశర్మకు సత్కారం


అష్టావధాని గౌరీభట్ల శ్రీనాథశర్మను సత్కరిస్తున్న శ్రీమదనానంద ధార్మిక సేవా పరిషత్ సభ్యులు

చేర్యాల, ఏప్రిల్ 5: ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల నిర్వహణతో పాటు కవితారచనలో విశేషకృషి చేస్తున్న కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల సాంద్రానందాశ్రమ నిర్వాహకుడు, కవి, అష్టావధాని గౌరీభట్ల శ్రీనాథశర్మ గురు సత్కారాన్ని అందుకున్నారు. ఆయా రంగాల్లో రాణించడాన్ని కీర్తిస్తూ హైదరాబాద్ శ్రీమదనానంద ధార్మిక సేవా పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పథనిర్దేశక మహాన్ బిరుదు ప్రదానం చేశారు. ఈ మేరకు శుక్రవారం చేర్యాల పట్టణంలోని సద్గురు సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సత్కరించారు.

'దళితులకు అన్ని రంగాల్లో అన్యాయం'

సిద్దిపేట,అర్బన్, ఏప్రిల్ 5: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ ఆయన అడుగుజాడల్లో నడవాలని తెలంగాణ దళిత పరిరక్షణ సమితి (టీడీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దబ్బెట శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీఎస్ జిల్లా కన్వీనర్‌గా పెర్క కిశోర్‌ను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత హక్కుల సాధన కోసమే టీడీపీఎస్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్ కుమార్, బాలరాజు, శామ్యూల్, సురేశ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

WANTED

★ SOUS CHEF for Newly Opening Multi - Cuisine Restaurant in VIJAYAWADA, AP (South Indian, Chinese & Continental). Exp: 8 + Years, Qual: Degree, Resume : m3344b@gmail.com

AJB-182035

PLOT FOR SALE

★ గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI దగ్గర, 161 చ.గ ఇంటి స్థలం అమ్మబడును సంప్ర: 8143366630/ 9989554915. AJH-002249

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి